

ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు.. రాష్ట్రపతి ముర్ము

2

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -118 మంగళవారం 13 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

**కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్**

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు**




**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. మిగతాది 2లో...



## బ్యాట్‌మన్ మాస్కులతో రాహుల్ గాంధీ..

**ఢిల్లీలో కాంగ్రెస్ వినూత్న ప్రచారం**



సాధారణంగా గోతమ్ సిటీని కాపాడే సూపర్‌హీరో బ్యాట్‌మన్ గురించి ఇప్పుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఇండియా కూటమి చేపట్టిన 'ఛలో ఢిల్లీ' మార్చ్‌లో మిగతాది 2లో...

# అప్రూవర్‌గా మారండి

## జ్ఞానేశ్‌కు రాహుల్ గాంధీ సూచన

**200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..**

**జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి**

**జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య**

**సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. మిగతాది 2లో...

# ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

**వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం**

**ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం**

**రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం**

**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలి**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, మిగతాది 2లో...



## ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

**స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు**

**స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్**

**కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్**

**ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం**

**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైనమిగతాది 2లో...

# ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

**పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన**

**ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం**

**హైదరాబాద్,అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితామిగతాది 2లో...



# ఘోర ప్రమాదం

## నలుగురి సజీవదహనం

**విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..**

**నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన**

**మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు**



**విజయవాడ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. మిగతాది 2లో...

# ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

**ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు**

**ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి**

**తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు**

**మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు**



**అమరావతిఅక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖమిగతాది 2లో...

# అన్నదాతల సమస్యల పట్ల సర్కారు నిర్లక్ష్యం: హరీశ్

**హైదరాబాద్, అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
రైతు వేదికల వద్ద రాష్ట్రంలోని అన్నదాతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే విషయమై సీఎం రేవంత్ రెడ్డి నాటకాలాడారని బీఆర్‌ఎవీసఎల్పీ ఉప నేత హరీశ్‌రావు ఆరోపించారు. 'రేపు ఉదయం 12 గంటలకు సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు రావాలని ఆదివారం రాత్రి మెసేజ్‌లు.. ఉదయం 9.52 గంటలకు రద్దయిందని.. 11 గంటలకు ఉంటుందనిమిగతాది 2లో...



# తిరుపతికి మహర్దశ

## రూ.3,222 కోట్ల పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం





**అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన**

**టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం**

**భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**

**నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం**

**అమరావతిఅక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**
కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. మిగతాది 2లో...

## ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

(మొదటి పేజి తరువాయి)

సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.

రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు.2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

# ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

(మొదటి పేజి తరువాయి)

కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.

ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

# అప్రూవర్‌గా మారండి

(మొదటి పేజి తరువాయి)

"మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు**

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

**మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ**

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

**సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి**

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**200 మంది అధికారులు టచ్‌లో**

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

**రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

# తిరుపతికి మహర్దశ

(మొదటి పేజి తరువాయి)

అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

**భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్**

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

**టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం**

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు**

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

(మొదటి పేజి తరువాయి)

కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు.. రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు

**కేరళ నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్**

**తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్**

**కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకూ కొత్త గవర్నర్లు**

**బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియామకాలు అమల్లోకి**

**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**



దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు.వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది.ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది.ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

## ఘోర ప్రమాదం

(మొదటి పేజి తరువాయి)



పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

(మొదటి పేజి తరువాయి)

సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు.ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ూవీఖీద్) పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## అన్నదాతల సమస్యల పట్ల సర్కారు నిర్లక్ష్యం: హరీశ్

(మొదటి పేజి తరువాయి)

మరో మెసేజ్.. మధ్యాహ్నం ఒంటిగంటకు సీఎంకు బదులు డిప్యూటీ సీఎం పాల్గొంటారని రైతులతో నాటకాలాడారు' అని చెప్పారు. రైతు సమస్యలపై సీఎం అధ్యక్షతన సమావేశం ఉంటుందని మొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించిన రోజే గోవా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. మరునాడు ఢిల్లీకెళ్లారని, ఆయన బాటలోనే మంత్రులు కూడా హస్తిన బాట పట్టారన్నారు.రైతులు పంటలు సాగు చేయకుంటే ఏం చేయాలని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో కరంటు కోత ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 'రెండు చేతులా సంపాదన.. కేంద్రీకృత టెండర్లలో కమీషన్ల దందా.. సంక్షేమ హాస్టళ్లకు సరుకుల సరఫరాలో అవినీతి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను హరీశ్‌రావు తన ఎక్స్ ఖాతాలో పోస్టుచేశారు. గురుకుల సంస్థల కాంట్రాక్టుల్లో జరుగుతున్న 20 శాతం కమీషన్లపై ఎందుకు విజిలెన్స్, సిట్ విచారణ చేపట్టడం లేదని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ ఖాతాకు తన పోస్టును ట్యాగ్ చేశారు.

హరీశ్‌రావు మామ మాధవరపు హన్మంతరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందినదిగా పేర్కొంటున్న 3.22 ఎకరాల భూమి విషయంలో తుది తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని రెవెన్యూశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని సర్వే నెంబర్ 271/18 ఈఈ, 271/18ఈ, 271/98లోని 3.22 ఎకరాలు అసైన్డ్ భూమి అని, దానిని హన్మంతరావు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేశారని రెవెన్యూ అధికారులు తెలిపారు.ఆ కొనుగోలు చెల్లదని, అందువల్ల దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని పేర్కొంటూ షోకాజ్ నోటీసులు పంపారు. వాటిని అడ్డుకోవాలని కోరుతూ మాధవరపు హన్మంతరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. షోకాజ్ నోటీసుకు రెండువారాల్లో వివరణ ఇవ్వాలని హన్మంతరావుకు ఆదేశాలు జారీచేసింది. తది తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని రెవెన్యూ అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

(మొదటి పేజి తరువాయి)

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.

ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ద

బ్యాట్‌మన్ మాస్కులు ప్రత్యేకాకర్షణగా నిలవడమే ఇందుకు కారణం. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నేతలు పంపిణీ చేసిన ఈ మాస్కులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుకుని ఫొటోలకు పోజులిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాహుల్ మాస్క్ ధరింపజేయడం మరింత ఆసక్తికరంగా మారింది. ఈ పోస్టులను ఎన్ఎస్‌యూఐ ఎక్స్‌లో షేర్ చేసింది.

రాహుల్‌ను అన్యాయంపై పోరాడే వ్యక్తిగా చూపే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ సోషల్ మీడియాలో బ్యాట్‌మన్ వేషాలను విస్తృతంగా వినియోగిస్తోంది. గతంలో రాహుల్‌ను బ్యాట్‌మన్‌తో పోలుస్తూ కాంగ్రెస్ 13 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు జరిగిన ప్రతిపక్షాల మార్చ్‌లో రాహుల్ బారికేడ్లపై నిల్చున్న దృశ్యాలను.. గోతమ్ నగరంలోని ఓ భవనంపై నిలబడిన బ్యాట్‌మన్‌తో జోడించి పోస్ట్ చేసింది. ఇన్‌స్టాలో 'మీరు బ్యాట్‌మనా?' అని కాంగ్రెసన్ అగ్రనేతను అడగ్గా.. 'నేనూ, బ్యాట్‌మన్ ఒకే గదిలో ఉన్నట్లు ఎవరూ ఎప్పుడూ చూడలేదు' అని ఛలోక్తులు విసిరారు.

# వర్గీకరణతోనే సామాజిక న్యాయానికి సార్థకత!

**మిగిలిన 2 శాతం రిజర్వేషన్ కోసం మరో పోరు -33 ఏళ్ల ఉద్యమ ఫలితం.. మాదిగ విద్యార్థులకు పెరగనున్న విద్యావకాశాలు**

**నల్లబెల్లిలో పరిశోధనా బృందానికి వివరించిన దళితరత్న బిర్రు మహేందర్ మాదిగ**









**వర్ధన్నపేట/ అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ వర్గీకరణతో మాదిగ విద్యార్థులకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో న్యాయమైన వాటా దక్కే అవకాశం ఏర్పడిందని ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు, దళితరత్న అవార్డు గ్రహీత బిర్రు మహేందర్ మాదిగ పేర్కొన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం తమకు 11 శాతం రిజర్వేషన్ రావాల్సి ఉండగా, ప్రస్తుతం 9 శాతమే దక్కిందని, మిగిలిన రెండు శాతం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించిన ఎస్సీ వర్గీకరణ అమలు, గ్రామీణ స్థాయిలో దాని ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ముఖర్జీ ఫాలోవర్స్ ఫర్ పాలసీ, పాలిటిక్స్ అండ్ గవర్నెన్స్ ఫౌండేషన్ (పీఎఫ్పీజీ) ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల పరిశోధనా బృందం సోమవారం నల్లబెల్లిలోని మహేందర్ మాదిగ నివాసాన్ని సందర్శించింది. తెలంగాణ నుంచి ఏడుపుగంటి శ్రీనిత్య, హర్యానా నుంచి సైనా ఖానేజా, పశ్చిమ బెంగాల్ నుంచి వేబజ్యోతి చక్రబోర్తి, మహారాష్ట్ర నుంచి పవన్ దివాలే తదితరులు బృందంలో ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ వల్ల లాభమా? నష్టమా? అని బృందం అడిగిన ప్రశ్నకు మహేందర్ మాదిగ సమాధానమిస్తూ.. వర్గీకరణతో మాదిగ విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు పెరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో మెడిసిన్, ఇంజినీరింగ్, న్యాయవిద్య వంటి కోర్సుల్లో తగిన ప్రాతినిధ్యం పొందలేకపోయామని, వర్గీకరణతో ఆ పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయం, జనాభా నిష్పత్తి ప్రకారం వాటాల సాధన దిశగా ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వెనుక ఉద్యమాల పాత్ర ఎస్సీ వర్గీకరణ ఉద్యమంతోపాటు సామాజిక సమస్యల పరిష్కారం కోసం కూడా మందకృష్ణ మాదిగ నిరంతరం పోరాడారని మహేందర్ మాదిగ వివరించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్ల పెంపు, పేదలకు మెరుగైన వైద్యసేవలు, రేషన్ బియ్యం పరిమాణం పెంపు వంటి అంశాలపై ఆయన చేసిన ఉద్యమాలను గుర్తుచేశారు. గుండెజబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్యం అందించాలనే డిమాండ్‌తో హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన సభ ఆరోగ్యశ్రీ పథకం ఏర్పాటుకు దోహదపడిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్ట పరిరక్షణ కోసం వరంగల్ కేంద్రంగా నిర్వహించిన ఉద్యమం సహా అనేక సామాజిక పోరాటాల గురించి పరిశోధనా బృందానికి వివరించినట్లు తెలిపారు. వర్గీకరణతోపాటు సామాజిక న్యాయం, విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో అణగారిన వర్గాలకు న్యాయం జరగాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మాజీ మండల





అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రభాకర్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షుడు బిర్రు రమేష్ మాదిగ, కుల పెద్దలు బిర్రు ఎల్లయ్య మాదిగ, బిర్రు రవీందర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ భరోసా

**ఎల్కతుర్తి మండలంలో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకు పరామర్శ**



**ఎల్కతుర్తి/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు జంగం రాజు, సూరవరం వేమారెడ్డి, వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు చదిరం రమేష్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, తంగేడ మహేందర్, గొల్లె మహేందర్, కడారి రాజు, కుర్ర సాంబమూర్తి గౌడ్, కోరే రాజ్ కుమార్, చదిరం నాగేశ్వర్, శ్రీనివాస్, జూపాక జడ్సన్‌తో పాటు మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తా

**జిట్టెగూడెం సర్పంచ్ బానోత్ బాలు నాయక్**



**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని జిట్టెగూడెం గ్రామ సర్పంచ్ బానోత్ బాలు నాయక్ అన్నారు. మండలంలోని జిట్టెగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో వీవోఏ భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లూనావత్ రజిత రవీందర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు లావుడ్య రవి, మహిళా సంఘం అధ్యక్షురాలు లావుడియా కవిత రాజు, ఉపాధ్యక్షురాలు బాదావత్ సుశీల, కోశాధికారి బానోత్ స్వరూప, లక్ష్మీ, నాయకులు లూనావత్ జయపాల్ నాయక్, అజ్మీరా వెంకన్న, బాలు, జయపాల్, సజ్యా, రోజా, బానోతు స్వర్ణ, లావుడ్య తిరుపతి, వాంకుడోత్ రవి, లావుడ్య వెంకులు, లాలు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

**అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ ధ్యేయం**



**కేసముద్రం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు దన్నసారికి చెందిన చింతనూరి సోమలక్ష్మివెంకన్న దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరడం ద్వారా నిరుపేద కుటుంబాలకు భద్రతతో పాటు ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ దారావత్ కిషోర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండా సురేష్, మార్కెట్ డైరెక్టర్ యాదగిరి, నాయకులు మల్లారెడ్డి, అజిత్ రెడ్డి, పింగిలి ప్రసాద్, రమేష్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఈవీ ఛార్జింగ్ ప్లాంట్‌కు భూమిపూజ



**ఖమ్మం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఈవీ ఛార్జింగ్ ప్లాంట్‌కు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీ ఛార్జింగ్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగానికి



ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్త వెంకటేశ్వరరావు, కనకమేడల గోపాలకృష్ణ, జక్కంపూడి కిషోర్, జక్కంపూడి రాము, మారెళ్ల లక్ష్మణరావు, జక్కంపూడి చంద్రశేఖర్, సామినేని రామ్ అప్పారావు తదితర నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## కొమురయ్య మృతదేహానికి అల్లం నాగేశ్వర్‌రావు నివాళి



**కేసముద్రం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌కు చెందిన కన్నెబోయిన కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ధన్నసరి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు కొమురయ్య నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొమురయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ధన్నసరి మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, వేముల శ్రీనివాస్‌రెడ్డి, భూమటి పురుషోత్తంరావు, మాజీ ఉపసర్పంచ్ రఫీ, మాజీ వార్డు సభ్యులు బానోత్ బాలు నాయక్, జనిగల కొమరవెల్లి తదితరులు పాల్గొన్నారు.

## వైరా పట్టణ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

**పురపాలక సంఘం సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**




**వైరా/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** వైరా పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. వైరా పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని పట్టణ అభివృద్ధి, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పేర్కొన్నారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైరా పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంతో జిలుగుల గ్రామాభివృద్ధికి చర్యలు

**తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్యానికి సహకరించాలి.. సర్పంచి ఘనబోయిన సృజనరాజు**



**ఎల్కతుర్తి/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిలుగుల గ్రామ సర్పంచి ఘనబోయిన సృజనరాజు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులను సమకూర్చుకుంటున్నట్లు వివరించారు. స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నేతృత్వంలో గ్రామానికి సంక్షేమ పథకాలు తీసుకురావడంతో పాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకుంటూ ముందుకు సాగుతామని తెలిపారు. గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నామని, గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలని మంత్రిని పలుమార్లు కోరినట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని సర్పంచి పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టల్లో సేకరించి, పంచాయతీ ట్రాక్టర్‌లో వేయడం ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలందరి భాగస్వామ్యంతో జిలుగుల గ్రామాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సృజనరాజు తెలిపారు.

## గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గామాత





**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని తాటికొండ గ్రామంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు దుర్గామాత గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు జీడికంటి వరుణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, గణపతి పూజ, నవగ్రహ పూజ, అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం కుంకుమ పూజ, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండగ బుచ్చయ్య, భవాని మాల స్వాములు పండగ రాజేశ్వర్, పర్శ రాజు, పండుగ సత్తయ్య, పండుగ రవి, అక్కెనపల్లి రాములు, మారపాక నాగరాజు, అక్కెనపల్లి రాకేష్, శ్రీపతి రాజు, నారబోయిన కార్తీక్, చిలువేరు వర్షిత, మొగ్గం ప్రవస్థి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## స్వశక్తితో ఎదిగి అభివృద్ధి సాధించాలి

**గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్**



**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రతి ఒక్కరూ ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగి అభివృద్ధి సాధించాలని గ్రామ సర్పంచ్ జోగు సంపత్ కుమార్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు పొన్నం పారిజాతం సత్యనారాయణ గౌడ్ నూతనంగా ఏర్పాటు చేసిన రవళి టెంట్‌హౌస్‌ను సోమవారం సర్పంచ్ జోగు సంపత్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదుగుతూ కుటుంబ అభివృద్ధితో పాటు గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ నాగరబోయిన శ్రీరాములు, టెంట్‌హౌస్ నిర్వాహకురాలు పొన్నం పారిజాతం సత్యనారాయణ గౌడ్, నాయకులు రాజేష్, నరహరి, పొన్నం రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చేతన గ్లోబల్ ఫౌండేషన్ తరఫున రవికుమార్‌కు సన్మానం.





**బయ్యారం/,అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త)** అమెరికాలోని ఫీనిక్స్ నగరంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో చేతన గ్లోబల్ ఫౌండేషన్ తరఫున వెనిగళ్ల రవికుమార్‌కు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. తనను ఆహ్వానించి గౌరవించిన ప్రవీణ్ సమాల,జ్యోతిరెడ్డి దుదిపాల,టిటిఏ ఫీనిక్స్ బృందానికి రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ,భావితరాలకు అందించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ గౌరవాన్ని చేతన గ్లోబల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవకులు, యువత మరియు సమాజ భాగస్వాముల తరఫున స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ గుర్తింపు తన సామాజిక సేవలను మరింత బాధ్యతతో కొనసాగించేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని ఈ సందర్భంగా రవి కుమార్ వెల్లడించారు.

# ఎంపీడీవో కార్యాలయంలో టేకు కలప మాయం!

**ఐదు చెట్లు నరికేశారు.. కలప ఏమైంది? -రూ.2 లక్షల విలువైన కలప తరలింపుపై అనుమానాలు**

**కల్లూరు/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఐదు టేకు చెట్లను నరికిన అనంతరం వాటి కలప ఏమైందన్న ప్రశ్నలు కలకలం రేపుతున్నాయి. సుమారు రూ.2 లక్షల విలువైన కలప కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నరికిన కలపను మరో గ్రామపంచాయతీకి తరలించినట్లు వస్తున్న ఆరోపణలతో ఈ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 120 నుంచి 150 అడుగుల మేర కలపకు సంబంధించిన వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

**అధికారులకే తెలియదా?**

ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోని చెట్లను నరికేందుకు అనుమతులు తీసుకున్నారా? నరికిన కలపను ఎక్కడికి తరలించారు? ఎవరి ఆదేశాల మేరకు తరలించారు? అనే



ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ వ్యవహారంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా తమకు తెలియదని చెప్పినట్లు సమాచారం. అటవీ శాఖ రేంజర్ సైతం తమ శాఖకు సంబంధం లేదని తెలిపినట్లు తెలిసింది. అయితే, చెట్ల నరికివేత, కలప తరలింపునకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది.

**బాధ్యులెవరో తేల్చాలి**

సామాన్యులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారులు.. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే ఇలాంటి ఘటన జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. కలప తరలింపు వెనుక ఎవరున్నారు? అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ ఆస్తికి సంబంధించిన కలప వివరాలను నమోదు చేశారా? అన్న అంశాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని, కలప ఆచూకీ కనుగొని వాస్తవాలను వెల్లడించాలని, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**అధికారులకు కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశం**

**మహబూబాబాద్/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి నాగలక్ష్మితో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

**భూమి పట్టా కోసం వినతి**

మహబూబాబాద్‌లోని గుమ్ముడూరు ప్రాంతానికి చెందిన అవారి నిర్మల సర్వే నంబరు 36/టూలో ఉన్న ఎకరం 19 గుంటల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా మంజూరు చేయాలని కోరారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన దేసంగి మహాలక్ష్మి గత 20 ఏళ్లుగా రేకుల ఇంట్లో నివసిస్తున్నానని, సరైన నివాస గృహం లేదని పేర్కొంటూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు



చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రోడ్డు విస్తరణపై ఫిర్యాదు**

కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన పురుషోత్తం రెడ్డి రోడ్డు విస్తరణ విషయంలో తనకు న్యాయం చేయాలని కోరారు. గ్రామపంచాయతీ అధికారులు రోడ్డు విస్తరణలో భాగంగా తన ఇంటి ప్రహరీ గోడకు మూడు అడుగుల మేర స్థలం అవసరమంటూ నోటీసులు ఇచ్చారని, అయితే తన స్థలంలోకి 12 అడుగుల వరకు వచ్చి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

**మొత్తం 203 దరఖాస్తులు**

సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కేంద్రంలో 119, డివిజన్ కేంద్రంలో 3, మండలాల్లో 81 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 203 దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూధనరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవిరాథోడ్, పశుసంవర్ధకశాఖ అధికారి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమశాఖ అధికారి దేశీరాం, ఇన్‌చార్జి డీఈవో మందుల శ్రీరాములు, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, పౌరసరఫరాల అధికారి రమేష్, పరిశ్రమలశాఖ అధికారి శ్రీమన్నారాయణరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, భూభారతి జిల్లా సమన్వయకర్త సురేష్, ఈడీఎం యుగేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఇండియా కూటమి మహా ధర్నా

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ -ధర్నాలో పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**






**హసన్‌పర్తి/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని నిరసిస్తూ ఇండియా కూటమి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహా ధర్నాలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. తెలంగాణ భవన్ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీగా ధర్నా వేదికకు చేరుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న తమపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. నిరసనల నేపథ్యంలో మెట్రో సేవలను నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని, బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఎస్‌ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎస్‌ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రతిపక్షాలు పెద్దఎత్తున నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.

# బతుకమ్మ పేరుతో మట్టి తరలింపు!

**ఆట స్థలానికి నామమాత్రంగా మట్టి పోసి.. మిగతాది విక్రయించారనే ఆరోపణలు**

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్**



**నర్సంపేట/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**
చెన్నారావుపేట మండలం తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో బతుకమ్మ ఆట స్థలానికి మట్టి పోసే పేరుతో అక్రమంగా మట్టి తరలించి విక్రయించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ ఆట స్థలంతోపాటు రోడ్డుకు నామమాత్రంగా మట్టి పోసి, మిగిలిన మట్టిని గ్రామంలోని ఇతర ప్రాంతాలకు, పక్క గ్రామాలకు తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వందల ట్రిప్పుల మట్టిని తరలించి ఒక్కో ట్రిప్పునకు రూ.వెయ్యి చొప్పున విక్రయించినట్లు చెబుతున్నారు. లెక్కల్లో తేడాలు రావడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామానికి ప్రథమ పౌరుడిగా ఉండాల్సిన సర్పంచ్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి పనుల పేరుతో మట్టి తరలింపునకు పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు. అధికారం చేతిలో ఉందనే ధీమాతో తమను ప్రశ్నించేవారెవరూ లేరన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

బతుకమ్మ ఆట స్థలానికి మట్టి పోసిన పనుల వివరాలు, తరలించిన మట్టి పరిమాణం, విక్రయాలకు సంబంధించిన లెక్కలను అధికారులు పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే పనులు జరిగాయా? అనే అంశాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు తేల్చి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సర్పంచ్ వివరణ, సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.



# ఫ్లోరైడ్ రహిత తాగునీటి కోసం సర్పంచ్ చొరవ

## ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు బాలవికాసకు విజ్ఞప్తి

**కేసముద్రం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బిచ్యానాయక్ తండా సర్పంచ్ వాంకుడోత్ రవినాయక్ ముందడుగు వేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని బిచ్యానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నారు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని బాలవికాస స్వచ్ఛంద సంస్థను కోరారు.



**మూడు తండాల్లో తాగునీటి ఇబ్బందులు**

బిచ్యానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని బిచ్యానాయక్ తండా, రాజీవ్‌నగర్ తండా, హరిచంద్రు తండాల్లో వెయ్యి మందికి పైగా గిరిజనులు నివసిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు బావులు, బోర్ల నీటిపై ఆధారపడుతున్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ సమస్యపై ఆందోళన వ్యక్తమవుతుండటంతో ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచ్ భావించారు.

**బాలవికాసకు లేఖ**

తాగునీటి సమస్య పరిష్కారానికి బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సింగారెడ్డికి సర్పంచ్ రవినాయక్ లేఖ రాశారు. తమ గ్రామపంచాయతీ పరిధిలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో పాటు పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

**సంస్థ స్పందించాలని ప్రజల విజ్ఞప్తి**

తండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సర్పంచ్ చేస్తున్న ప్రయత్నాలపై స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బాలవికాస సంస్థ స్పందించి ఆర్‌ఓ ప్లాంట్ మంజూరు చేస్తే మూడు తండాల ప్రజలకు తాగునీటి కష్టాలు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ త్వరగా స్పందించాలని తండావాసులు కోరుతున్నారు.

# చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య పరికరాలు అందజేత

## క్యాన్‌ఫిన్ హోమ్స్, కెనరా బ్యాంకు సంయుక్త సహకారం



**జనగామ/చేర్యాల/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** జనగామ నియోజకవర్గంలోని చేర్యాల ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు క్యాన్‌ఫిన్ హోమ్స్ సంస్థ, కెనరా బ్యాంకు సహకారంతో అత్యవసర వైద్య పరికరాలను సోమవారం అందజేశారు. అత్యవసర వైద్య సేవలకు అవసరమైన మందులు, క్రాష్ కార్ట్, పల్స్ ఆక్సీమీటర్, 12 ఛానళ్ల ఈసీజీ యంత్రం, లేబర్ రూమ్ టేబుళ్లు, పరుపులతో కూడిన ఇనుప పడకలను ఆసుపత్రికి అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. దేవేందర్ మాట్లాడుతూ, అత్యవసర వైద్య పరికరాల అందుబాటుతో రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వైద్య పరికరాలను అందించిన క్యాన్‌ఫిన్ హోమ్స్ సంస్థ, కెనరా బ్యాంకు ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాన్‌ఫిన్ హోమ్స్ సంస్థ తెలంగాణ జోనల్ హెడ్ లక్ష్మి, బ్యాంకు మేనేజర్ సుధీర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థులకు వైద్య శిక్షణ

## కేసముద్రం పీహెచ్‌సీలో 10 రోజుల ఇంటర్న్‌షిప్ ప్రారంభం



**కేసముద్రం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** కల్వల తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ విద్యార్థులకు కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పది రోజుల ఇంటర్న్‌షిప్ ప్రారంభమైంది. హెచ్‌ఓడీ ఆకుతోట సురేంద్ర ఆదేశాల మేరకు పాఠశాల ప్రిన్సిపల్ పరిమి నవీన్, హెల్త్‌కేర్ ఇన్‌చార్జి ఇసంపల్లి ప్రవళిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నంబి కిషోర్, డాక్టర్ శివరాం పర్యవేక్షణలో విద్యార్థులు అక్షయ, కీర్తి, భాను, అనుష ప్రాయోగిక శిక్షణ పొందారు. రోగులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయులు, థైరాయిడ్ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడంతోపాటు ఆసుపత్రికి వచ్చే రోగుల సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని వైద్యులు సూచించారు. పది రోజుల శిక్షణలో వైద్య సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు.



# బుడోకాన్ కరాటే గ్రేడింగ్ టెస్టుల్లో ముఖ్య అతిథిగా మాస్టర్ పాశం దేవయ్య



**హసన్‌పర్తి/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్ కాలనీలో నిర్వహించిన బుడోకాన్ కరాటే గ్రేడింగ్ టెస్టుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా బుడోకాన్ కరాటే వరల్డ్ ట్రెజరర్, బ్లాక్‌బెల్ట్ మాస్టర్ పాశం దేవయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రేడింగ్ టెస్టులను పర్యవేక్షించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎల్లో, బ్లూ, బ్రౌన్ బెల్టులను ప్రదానం చేశారు. బుడోకాన్ కరాటే ప్రధాన కార్యదర్శి బి. రవీందర్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బుడోకాన్ కరాటే అధ్యక్షుడు బి. చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతినిధులు బి. రాజగోపాల్, మహిళా బ్లాక్‌బెల్ట్ పూర్ణిమ, రామ్మూర్తి, బాల నరసయ్య, ముఖేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వారాల కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి -వారాల కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావుశెట్టి నరసింహ రాములు

**హసన్‌పర్తి/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** అన్ని రంగాల్లో వెనుకబడిన వారాల కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వారాల కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావుశెట్టి నరసింహ రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని వారాల కుల సంఘం కమ్యూనిటీ భవనంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు గుండమీది రవీందర్ అధ్యక్షతన, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కందుకూరి సంజీవయ్య సమన్వయంతో నాలుగో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసింహ రాములు మాట్లాడుతూ, తెలంగాణలో వారాల కులాన్ని రాష్ట్ర బీసీ జాబితాలో చేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఇందుకోసం కృషి చేసిన తెలంగాణ వారాల కుల సంఘం కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే కేంద్ర ఓబీసీ జాబితాలో ఈ కులానికి చోటు లేకపోవడంతో అనేక మంది విద్యావంతులు, వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వరయ్య కమిషన్‌కు అవసరమైన సమాచారాన్ని



తెలంగాణ వారాల కుల సంఘం ద్వారా అందజేసినట్లు తెలిపారు. సంబంధిత వివరాలను తక్షణమే పరిశీలించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమగ్ర విచారణ చేపట్టి వారాల కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారాల కుల సంఘం అభివృద్ధి సాధించాలంటే రాజకీయంగా కూడా ఎదగాల్సిన అవసరం ఉందని నరసింహ రాములు అన్నారు. రాబోయే రోజుల్లో వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న వారంతా కుల సంఘం ప్రతినిధుల విజయానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నిర్వహించనున్న క్యాలెండర్ ఆవిష్కరణ, ప్రతిభా పురస్కారాల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో వారాల కుల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి పావుశెట్టి కృష్ణవేణి, జిల్లా కోశాధికారి గంట నాగేశ్వర్, గ్రామ అధ్యక్షుడు పావిశెట్టి రాజు, కార్యదర్శి గుండమీది కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు ములుగురి రాజమౌళి, వివిధ గ్రామాల కార్యవర్గ సభ్యులు మలుగూరు బిక్షపతి, గంట సత్యనారాయణ, బొమ్మిశెట్టి యాదగిరి, శ్రీనివాస్, మహేష్, ప్రవీణ్, అభిలాష్, కోటిలింగం, కొండమీది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటు ప్రకాష్‌రావుకు నివాళులర్పించిన సండ్ర వెంకట వీరయ్య

## దశదిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు పరామర్శ



**తల్లాడ/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పాత మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రోటు శ్రీనివాసరావు తండ్రి ప్రోటు ప్రకాష్‌రావు ఇటీవల మృతి చెందారు. సోమవారం నిర్వహించిన ఆయన దశదిన కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, మిట్టపల్లి బీఆర్ఎస్ నాయకుడు మాగంటి నాగులు, గంగాదేవిపాడు సొసైటీ మాజీ డైరెక్టర్ జంగా చిన్న వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ కోపిల కనకయ్య, చల్లా వెంకటేశ్వరరావు, మండేపూడి ప్రసాద్, గోపిశెట్టి ప్రసాద్, అమరనేని నాగయ్య, కొండ బసవయ్య, కొండ యేశోబు, కందుల వెంకటి తదితరులు పాల్గొన్నారు.ం

# రంగాపురం సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా

## లోఓల్టేజీ, అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలకు నష్టం -రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకుల ఆందోళన.. ఎస్సై హామీతో విరమణ

**కేసముద్రం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** లోఓల్టేజీ, అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. కేసముద్రం మండలం బెరువాడ గ్రామ పరిధిలోని రంగాపురం సబ్‌స్టేషన్ ఎదుట సోమవారం బీఆర్ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని, దీంతో పంటలకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సబ్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. దీంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



**రైతులకు బీఆర్ఎస్ మద్దతు**

విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా నిలిచారు. రైతులతో కలిసి ధర్నాలో పాల్గొని విద్యుత్ సరఫరా సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలకు సకాలంలో నీరందక నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి లోఓల్టేజీ సమస్యను తొలగించడంతోపాటు కోతలు లేకుండా సరఫరా చేయాలని కోరారు.

**ఎస్సై హామీతో ధర్నా విరమణ**

సమాచారం అందుకున్న కేసముద్రం ఎస్సై కె. కాంతి కిరణ్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడారు. విద్యుత్ ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎస్సై హామీ మేరకు రైతులు, నాయకులు ధర్నాను తాత్కాలికంగా విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బెరువాడ గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, టౌన్ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ వీరు నాయక్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము స్వాతి రాహుల్, మండల అధికార ప్రతినిధి మోడం రవీందర్‌గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ రామ్మూర్తి, యువజన నాయకుడు ఇ. నరేష్, గుడి తండాకు చెందిన బోడ వీరు, మర్రితండాకు చెందిన సులేమాన్, భానుగడ్డ మాజీ సర్పంచ్ జెరుపుల రాజు, కార్యకర్త కే. మహేష్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే.

## -సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్.






**బయ్యారం/,అక్టోబర్ 12:(జర్నలిస్ట్ వార్త)**ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సమీక్షలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపీలు ర్యాలీ నిర్వహించారు. నిరసనను అడ్డుకునేందుకు భారీగా మోహరించిన పోలీసులు, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పలువురు కాంగ్రెస్ ఎంపీలు, నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# యాసంగిలో ఆచితూచి సాగు చేయాలి!

## ఎల్‌నినో పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలి

## తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలకే ప్రాధాన్యం

## అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):** యాసంగి సాగులో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలను ఎంపిక చేసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులను పరిగణనలోకి తీసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. వానకాలం పంటలను కాపాడటంతోపాటు యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ శాఖతో పాటు ఇతర అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం**

ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్, పెద్దపెండ్యాల, నారాయణగిరి రైతు వేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ జిల్లాల రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఎల్‌నినో పరిస్థితులు, వ్యవసాయంపై వాటి ప్రభావం, రానున్న యాసంగి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**నీటి వినియోగంపై ప్రణాళిక అవసరం**

వానకాలం పంటలను అన్ని శాఖల సమన్వయంతో కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. యాసంగి సాగుకు సంబంధించి ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. అధిక నీరు అవసరమయ్యే పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు. తక్కువ నీటితో పండే స్వల్పకాలిక పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవచ్చని వివరించారు.

**గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి**

జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో అధికారులు రైతులకు పంటల ఎంపికపై సమగ్ర అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు సూచించారు. వ్యవసాయ శాఖతోపాటు పశుసంవర్ధక, విద్యుత్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, పంట కాలపరిమితిని పరిగణనలోకి తీసుకొని రైతులు సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేసి రైతులకు అవసరమైన సలహాలు అందించాలని అధికారులకు సూచించారు.

**అధికారులు, ప్రజాప్రతినిధుల హాజరు**

ధర్మసాగర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా పాల్గొన్నారు. అదనపు డీఆర్డీఏ అధికారి లక్ష్మీ ప్రసన్న, మండల వ్యవసాయ అధికారి రాజేష్, పశుసంవర్ధక శాఖ అధికారి మమత, ఎంపీఓ అఫ్జల్, ఎన్పీడీసీఎల్ ఏడీఈ పైడయ్య, ఏఈ జ్యోతిర్మయినాథ్, ఏఈఓలు దివ్య, రాజేందర్, ఏపీఎం మహేందర్, ఏపీవో సంపత్, ఐకేపీ సిబ్బంది, ధర్మసాగర్ పీఏసీఎస్ సిబ్బంది ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

# నిహా కన్వెన్షన్ హాల్‌లో వైభవంగా అన్షిక రెడ్డి జన్మదిన వేడుకలు.






**బయ్యారం/,అక్టోబర్ 12.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కాంగ్రెస్ నాయకులు తిరుమల చంద్రారెడ్డి, స్వర్ణలత మనుమరాలు, అఖిల్ రెడ్డిపద్మజ రెడ్డి దంపతుల కుమార్తె అన్షిక రెడ్డి తొలి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్గుతండ గ్రామపంచాయతీ పరిధిలోని నిహా కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఈ వేడుకలు కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు,రాజకీయ ప్రముఖుల సందడితో ఉత్సాహభరితంగా సాగాయి. ఈ వేడుకలకు బయ్యారం మండలానికి చెందిన పలువురు అధికారులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరై చిన్నారి అన్షిక రెడ్డిని ఆశీర్వదించారు. చిన్నారి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని,భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంకపల్లి అశోక్ రెడ్డి, మూల మధుకర్ రెడ్డి, తిరుమల దేవి రెడ్డి, తిరుమల ప్రభాకర్ రెడ్డి,సూరం సుధాకర్ రెడ్డి,తమ్మిశెట్టి వెంకటపతి,నాయిని ఇంద్రారెడ్డి,తుమ్మల శ్రీనివాస్ రావు, గుంజ వీరస్వామి,సంపత్‌తో పాటు పలువురు నాయకులు,బంధువులు,కుటుంబ సభ్యులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

# ఖమ్మంలో శ్రీవారి దివ్యక్షేత్రానికి శంకుస్థాపన

## రూ.100 కోట్లతో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం -చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో అంగరంగ వైభవంగా మహోత్సవం.. గోవింద నామస్మరణతో మారుమోగిన అల్లిపురం




**ఖమ్మం/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**

ఖమ్మం నగర ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంచేలా అల్లిపురం వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్ర నిర్మాణానికి సోమవారం భూమిపూజ, శంకుస్థాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఆలయ కార్యక్రమానికి త్రిదండి చిన్నజీయర్ స్వామి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హాజరయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ప్రజలు భారీగా తరలిరావడంతో అల్లిపురం ప్రాంతం గోవింద నామస్మరణతో మారుమోగింది.

**తుమ్మల కృషితో ఆలయ నిర్మాణం**

ఖమ్మం నగరంలో శ్రీవారి ఆలయ నిర్మాణం సాకారం కావడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారు. ఆలయ నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లతో ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఈ దివ్యక్షేత్రం ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక గుర్తింపును తీసుకురావడంతో పాటు భవిష్యత్ తరాలకు భక్తి, సంస్కృతి సంప్రదాయాలను పరిచయం చేసే కేంద్రంగా నిలవనుంది.

**చిన్నజీయర్ స్వామికి కృతజ్ఞతలు**

మధ్యప్రదేశ్‌లో ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పటికీ తన విజ్ఞప్తి మేరకు ఖమ్మం ఆలయ శంకుస్థాపనకు విచ్చేసిన త్రిదండి చిన్నజీయర్ స్వామికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి రామాలయ పునర్నిర్మాణ పనులకు కూడా చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. స్వామివారి ఆశీస్సులతో ఆలయ నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు.

**తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ధన్యవాదాలు**

ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ు

**భారీగా తరలివచ్చిన భక్తులు**

శంకుస్థాపన మహోత్సవంలో ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జక్కంపూడి కిషోర్‌తో పాటు తల్లాడ మండల నాయకులు లక్ష్మీరెడ్డి, వీరారెడ్డి, లచ్చిరెడ్డి, మారెళ్ల లక్ష్మణరావు, జోసఫ్ తదితరులు హాజరయ్యారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కొత్తపేటలో అట్టహాసంగా ‘తుడుం దెబ్బ‘జిల్లా కార్యాలయం ప్రారంభం.



**బయ్యారం/,అక్టోబర్ 12.(జర్నలిస్ట్ వార్త)**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటలో ఆదివాసి హక్కుల పోరాట సమితి ‘తుడుం దెబ్బ‘ జిల్లా కార్యాలయం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఆదివాసి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా తుడుం దెబ్బ బయ్యారం మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పలువురు ప్రముఖ ఉద్యమ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్,ఆదివాసి సంఘాల జేఏసీ ఛైర్మన్ పూనం శ్రీనివాస్,తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వట్టం కన్నయ్య, జిల్లా అధ్యక్షులు చీమల శివకుమార్, బయ్యారం మండల అధ్యక్షులు అల్లెం కృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు గలిగి రమేష్,నాయకులు బొల్లి మన్సూర్,సీమల రాజు తదితరులు కార్యాలయ ప్రారంభోత్సవ వేదికపై నాయకులు “జై ఆదివాసి,జై కొమరం భీమ్, జై బిర్సా ముండా“ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా బయ్యారం మండలంలో ఆదివాసి హక్కుల పోరాటాలు మరింత ఉధృతం చేయనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.

# వర్ధన్నపేటలో నేడే వాహనాల వేలం

**వర్ధన్నపేట/అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వర్ధన్నపేట పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వరంగల్ ఆధ్వర్యంలో అక్టోబరు 13న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50 శాతం మొత్తాన్ని చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

# రెండో పంట సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి



**వర్ధన్నపేట/ అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు రెండో పంట సాగులో అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.

నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితులను అంచనా వేసుకున్నాకే పంటలు సాగు చేయాలని సూచించారు. తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలకు ప్రాధాన్యమివ్వాలని, దీర్ఘకాలిక పంటల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పంటలు వేసే ముందు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ శాస్త్రీయ పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయసాగర్, మండల ప్రత్యేక అధికారి కె.నాగరాజు, వ్యవసాయ అధికారి విజయసాగర్, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




# ఢిల్లీలో కాంగ్రెస్ పాదయాత్ర

## పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్

**వరంగల్/ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త):** ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పాదయాత్ర నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసనలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, జాటోతు రామచంద్రనాయక్, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు.




# బ్రహ్మచారిణి అలంకారంలో భ్రమరాంబిక అమ్మవారు



**ఐనవోలు/అక్టోబర్ 12 (జర్నలిస్ట్ వార్త):**

ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీ భ్రమరాంబిక అమ్మవారు దసరా శరన్నవరాత్రుల్లో రెండో రోజు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిత్యాహ్నికం, బాలానుష్ఠానాలు, చతుస్థానార్చన, కుమారీపూజ, మహానైవేద్యం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్, ఉప ప్రధానార్చకులు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ, వేదపారాయణదారు విక్రాంత్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, నరేష్ శర్మ, ఉప్పుల శ్రీనివాస్, దేవేందర్ సాయి వరుణ్, మణిశర్మతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
మంగళవారం 13 అక్టోబర్ 2026

# పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం

## 13 మంది లబ్ధిదారులకు రూ.6.70 లక్షల చెక్కుల పంపిణీ



**ఐనవోలు/ అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు, ఆర్థికంగా అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని ఐనవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు సోమవారం ఐనవోలులో 13 మంది లబ్ధిదారులకు రూ.6.70 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలు వైద్య చికిత్స కోసం దరఖాస్తు చేసుకోగా, వారికి ఆర్థిక సాయం మంజూరైందని మోహన్‌గౌడ్ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సహాయం అందిస్తోందన్నారు. అర్హులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్లగూడెం సర్పంచి దుపల్లి రాకేశ్, వనమాల కనపర్తి సర్పంచి రిపిక ఎల్లస్వామి, తిరుపతిరెడ్డి, వార్డు సభ్యుడు రిపిక వినయ్, చింత కుమారస్వామి, చింత బాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంటలను ఎండబెడుతున్న విద్యుత్ లోపాలు..

## ప్రజావాణి లో ధర్మసాగర్ రైతుల ఆర్తి! -పరిమితికి మించి మోటార్లు.. కాలిపోతున్న పంపుసెట్లు

### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం.. ఏడాదిగా ఇబ్బందులు పడుతున్నాం

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో అక్టోబర్12 (జర్నలిస్ట్ వార్త)** మండల పరిధిలోని ఎలుకుర్తి విద్యుత్ సరఫరా కేంద్రం (ఫీడర్) పరిధిలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర నిలకడలేని విద్యుత్ (లో-వోల్టేజ్) సమస్యను వెంటనే పరిష్కరించి తమ పంటలను కాపాడాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మండల నోడల్ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

**పరిమితి దాటిన కనెక్షన్లు.. ఎండిపోతున్న పంటలు**

సంబంధిత ఎస్ఎస్-21 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కేవలం 23 విద్యుత్ అనుసంధానాలకు (మోటార్లకు) మాత్రమే అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే ప్రస్తుతం అక్కడ నిబంధనలకు విరుద్ధంగా 30కి పైగా మోటార్లు నడుస్తున్నట్లు రైతులు తెలిపారు.

సామర్థ్యానికి మించి మోటార్లు నడుస్తుండటంతో తీవ్రమైన లో-వోల్టేజ్ సమస్య తలెత్తుతోందని, దీని కారణంగా తరచూ విద్యుత్ మోటార్లు కాలిపోయి తీవ్ర ఆర్థిక నష్టాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక విద్యుత్ లైన్ చివరి భాగంలో ఉన్న పంపుసెట్లకు అసలు కరెంట్ అందడం లేదని, పంటలకు నీరు పారక ఎండిపోయే పరిస్థితి



దాపురించిందని వాపోయారు.

**ఆరు నెలల క్రితం గద్దె కట్టి వదిలేశారు!**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. సమస్య పరిష్కారం కోసం ఆరు నెలల క్రితం కేవలం ఒక సిమెంట్ గద్దె నిర్మాణం చేపట్టి పనులను మధ్యలోనే వదిలేశారని, ప్రశ్నిస్తే రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.




# దొరికిపోతాననే భయంతో చంపేశాడు

**బొల్లారంలో చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు..**

**24 గంటల్లో నిందితుడి అరెస్టు.. రిమాండు**

**ఏడుస్తూ, చేతులతో కొడుతుండడంతో అతడు పాపను హత్య చేశాడు**

**వెల్లడించిన మల్కాజిగిరి సీపీ సుమతి**

**పనివాళ్ల వివరాలు పోలీసులతో ధ్రువీకరించుకోవాలని సూచన**




**హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐదేళ్ల చిన్నారి హత్య కేసు నిందితుణ్ని 24 గంటల్లో అరెస్టు చేసి కోర్టుల హాజరుపరిచామని మల్కాజిగిరీ సీపీ సుమతి తెలిపారు. హైదరాబాద్‌లోని బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో.. కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న రిసెర్చ్ సైంటిస్ట్ మిల్టర్ ఫెర్నాండజ్ మోసెస్ (44) కుమార్తె ఆరెలియా (5) అలియాస్ మోనును నిందితుడు చీకటిగా ఉన్న సెల్లార్‌లోకి తీసుకెళ్లాడని, పాప భయంతో ఏడుస్తూ, చేతులతో నిందితుడి ముఖంపై కొట్టడం ప్రారంభించడంతో ఆమెను సముదాయించలేక, దొరికిపోతాననే భయంతో చంపేశాడని వివరించారు. సెల్లార్‌లో దొరికిన తాళ్లతో పాప కాళ్లు, చేతులు కట్టేసి, గొంతుకు ఉరిబిగించి హత్య చేశాడని.. తర్వాత అక్కడే పడి ఉన్న ఒక రాయిని పాప వీపునకు కట్టి పాడుబడ్డ నీళ్ల సంపులో పడేసి ఏమీ ఎరుగనట్లు వెళ్లిపోయాడని చెప్పారు.

పాప తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అనంతరం.. ఎస్‌వోటీ, క్రైమ్స్, ఎస్‌బీ, టెక్నికల్, లా అండ్ ఆర్డర్ పోలీసులు కలిసి 10 బృందాలుగా ఏర్పడి సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారని సీపీ తెలిపారు. కిడ్నాపర్ ఫోన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి దర్యాప్తు వేగవంతం చేశామని తెలిపారు. వందలాది, సీసీ ఫుటేజీలు, పరిశీలించిన పోలీసులు బాలిక గేటెడ్ కమ్యూనిటీ నుంచి బయటకు రాలేదని గుర్తించామని.. వెంటనే గేటెడ్ కమ్యూనిటీలోని అణువణువు గాలించగా.. క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని నీటిగుంతలో బాలిక మృతదేహం కనిపించిందని చెప్పారు. వెంటనే టెక్నికల్, ఫోరెన్సిక్ బృందాలు అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించాయని.. పోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని విషయాలు తెలుస్తాయని సీపీ తెలిపారు.

**రెండువారాలకే పనిమానేసి..**

బీహార్ నలంద జిల్లాకు చెందిన విక్రమ్ కుమార్ కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 6 వరకూ (రెండు వారాలపాటు) సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. ఆ గేటెడ్ కమ్యూనిటీలో చురుగ్గా తిరిగే చిన్నారి ఆరేలియాపై అతడి కన్ను పడింది. పాపను కిడ్నాప్ చేసి, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు చేయాలని విక్రమ్ పథకం వేశాడు. పథకంలో భాగంగా ఈనెల 10న గేటెడ్ కమ్యూనిటీలో దసరా సందర్భంగా జరుగుతున్న పనులు చేసేందుకు వచ్చానంటూ గేటు వద్ద సెక్యూరిటీకి చెప్పి సాయంత్రం 6.40 గంటల ప్రాంతంలో లోపలికి వచ్చాడు. అక్కడ అతడికి ఆరేలియా కనిపించింది. ఆమెను మాటలతో మభ్యపెట్టి సెల్లార్‌లోకి తీసుకెళ్లాడు. ఆమెతో మంచిగా మాట్లాడి ఆమె తండ్రి, తాత ఫోన్ నంబర్ తెలుసుకున్నాడు. గతంలో అతడు సెక్యూరిటీ గార్డుగా పనిచేసి ఉండడంతో పాప అతణ్ని నమ్మి, అమాయకంగా వారి నంబర్లు ఇచ్చింది. అయితే, సెల్లార్‌లో చీకటిగా ఉండటం, అక్కడ ఇంకెవరూ లేకపోవడంతో భయపడి ఏడవడం మొదలుపెట్టింది.

అడ్డుకున్న విక్రమ్ ముఖంపై కొడుతూ ఏడుస్తుండడంతో అతడు ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపేశాడు. తర్వాత, ఏమీ తెలియనట్లు అక్కణ్నుంచీ బయటకెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత.. పాప తాతకు ఫోన్ చేసి, ఆమెను కిడ్నాప్ చేశానని, రూ.20లక్షలు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. డబ్బులు ఇస్తామని, పాపను చూపించాలని కోరినా చూపించలేదు. అప్పటికే రంగంలోకి దిగిన పోలీసుల



తెల్లవారుజామున 4 గంటలకు సంపులో పాప మృతదేహాన్ని గుర్తించారు. అందరూ గుండెలుపగిలేలా రోదిస్తున్న సమయంలో విక్రమ్ మరోసారి ఫోన్‌చేసి.. "డబ్బులు ఇస్తారా? పాపను చంపేయాలా?" అంటూ బ్లాక్‌మెయిల్ చేశాడు. పోలీసులు ఆ ఫోన్‌కాల్ ఆధారంగా సాంకేతికతను వాడి నిందితుడు యూస్‌ఫగూడలో ఉన్నట్టు గుర్తించి ఆదివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**పనివారితో భద్రం: సీపీ సుమతి**

గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించేవారు తమ వద్ద పనిచేస్తున్న సిబ్బంది, సెక్యూరిటీ, వాచ్‌మెన్‌లు, ఇంటి పనివారి వివరాలు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని మల్కాజిగిరి సీపీ సుమతి సూచించారు. దీని కోసం పోలీసులు అందించే "మీ సురక్ష- డొమెస్టిక్ హెల్పర్స్ వెరిఫికేషన్" సేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీ పూర్తిగా కవర్ అయ్యేలా అత్యాధునిక సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, పోలీసులతో అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, నివాసితులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఉక్రెయిన్ యుద్ధంలో తెలంగాణ వాసి మృతి.. కుటుంబానికి అండగా రేవంత్ సర్కారు

**అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త):**



రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తెలంగాణ వాసి కుటుంబానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. జగిత్యాల జిల్లా, హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మృతిచెందగా, అతడి కుటుంబానికి రూ. 6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ప్రకటించారు.వివరాల్లోకి వెళితే, సుదర్శన్ గౌడ్ ఉపాధి కోసం నాలుగు నెలల క్రితం ఉక్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ జరుగుతున్న యుద్ధంలో భాగంగా క్షిపణులు, డ్రోన్ దాడుల కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.సుదర్శన్ గౌడ్ భార్య విజ్ఞప్తి మేరకు, ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన సీఎం, ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, సీఎం సహాయ నిధి (జవీ=ఖీ) నుంచి ఈ మొత్తాన్ని విడుదల చేసేందుకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, సుదర్శన్ గౌడ్ భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# భారత్-విండీస్ టీ20: ఉప్పల్ స్టేడియానికి 2200 మంది పోలీసులతో భారీ భద్రత

**అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త):**



హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం మరో అంతర్జాతీయ మ్యాచ్‌కు సిద్ధమైంది. అక్టోబర్ 14న రాత్రి 7 గంటలకు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్ కోసం మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అత్యంత పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బందోబస్తు కోసం ఏకంగా 2,200 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.స్టేడియం లోపల, వెలుపల ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయనున్నారు. వీరితో పాటు షీ టీమ్స్, బాంబ్ డిటెక్షన్ స్క్వాడ్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ వంటి ప్రత్యేక బృందాలు కూడా రంగంలోకి దిగుతున్నాయి. స్టేడియంలో ఇప్పటికే ఉన్న 408 సీసీటీవీ కెమెరాలతో పాటు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా కూడా నిఘా పెట్టనున్నారు. ప్రతి కదలికను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించనున్నారు.మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులు, మహిళలు, పిల్లల భద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు. ఆటగాళ్ల భద్రత విషయంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ.. మ్యాచ్ సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. "మీ భద్రత మా బాధ్యత  మీ సహకారం మా బలం" అని ఆమె పేర్కొంటూ, ప్రేక్షకులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ సర్కారుపై రాజగోపాల్ రెడ్డి ఫైర్..

## టెండర్లలో భారీ అవకతవకలంటూ ఆరోపణ!

**అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 నిర్మాణ టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.తమ సొంత ప్రభుత్వంలోనే ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరమని ఆయన అన్నారు. మూడు ప్యాకేజీలకు గానూ ఇతర సంస్థల కన్నా రూ.600 కోట్లు తక్కువకు తమ కంపెనీ బిడ్లు దాఖలు చేసినప్పటికీ, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు పెట్టి తమను



పక్కనపెట్టారని ఆరోపించారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉండే శాఖలోనే ఈ దోపిడీ జరగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు.టెండర్లలో పాల్గొనవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తనకు ఫోన్లు వచ్చాయని, అయినా తాము పోటీలో నిలిచామని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళతానని స్పష్టం చేశారు. తమ కంపెనీని అనర్హులుగా ప్రకటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, న్యాయపరంగా సుప్రీంకోర్టు వరకు పోరాడతానని హెచ్చరించారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన పరిణామాలనే ఇది గుర్తు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు ఎవరు చేసినా తప్పేనని, రేవంత్ రెడ్డి చేసినా తాను వ్యతిరేకిస్తానని పేర్కొన్నారు. ఇలాంటి దోపిడీ జరుగుతుంటే ఢిల్లీలో పార్టీ నిర్వహించే నిరసనలో ఎలా పాల్గొంటానని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఇటువంటి అవినీతిపై పోరాటం కొనసాగిస్తానని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# రైతు బజార్లలో కిలో సన్నబియ్యం రూ.50కే..

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

అక్టోబర్ 12(జర్నలిస్ట్ వార్త);

సామాన్య ప్రజలకు ఊరట కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, రైతు బజార్ల ద్వారా నాణ్యమైన సన్నబియ్యాన్ని సరసమైన ధరకే అందించేందుకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్నబియ్యాన్ని కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఇప్పటికే రైతు బజార్లలో బీపీటీ రకం బియ్యం కిలో రూ. 49కు అందుబాటులో ఉండగా, తాజాగా కేఎన్ఎం రకాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఒక్కో కుటుంబానికి నెలకు 26 కిలోల ప్యాకింగ్‌ను పంపిణీ చేయనున్నారు. బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధర కిలో రూ. 90 వరకు ఉన్న తరుణంలో, ప్రభుత్వ నిర్ణయం సామాన్యులకు భారీ ఊరటనివ్వనుంది. నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు చేరవేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.ఈ విక్రయాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడలోని భవానీపురం రైతు బజార్‌లో నేడు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు తమ సమీపంలోని రైతు బజార్లను సంప్రదించి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# మేధ, జై జాస్తి జంటగా

## మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం





టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.

# అల్లు అర్జున్ తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్న లోకేశ్

### "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే.." అంటూ క్యాప్షన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి.అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ వీడియో సినిమా కథ గురించి పెద్దగా వివరాలు వెల్లడించకపోయినా.. ప్రాజెక్టుపై భారీ అంచనాలు పెంచింది.'ఏఏ23'ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గతంలో అల్లు అర్జున్ నటించిన బ్లాక్‌బస్టర్ 'పుష్ప'ను కూడా ఈ నిర్మాణ సంస్థే తెరకెక్కించింది. అయితే 'ఏఏ23' కథ, ఇతర నటీనటులు, చిత్రీకరణ వివరాలపై అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది.మరోవైపు అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా తొలిసారి జంటగా కనిపించనున్న ఈ సినిమాపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా 'రాకా'ను అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.ఇప్పుడు 'ఏఏ23'పై లోకేశ్ చేసిన తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందా? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

# నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

### ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి





దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.
సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు.'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు.రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అసలు ఊహించలేదు..

### జడ్జిగా అవకాశం రావడంపై అనుపమ కామెంట్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ నటిస్తూ అదరగొడుతున్న ఆమె, త్వరలోనే 'క్రేజీ కల్యాణం' సినిమాతో అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న అనుపమ, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా రియాలిటీ షోకి జడ్జిగా మారడంపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. షాకింగ్‌గా అనిపించింది: ఇంటర్వ్యూలో భాగంగా "అది కొత్త ఏమీ కాదు.. జడ్జి అవ్వడం, డాన్స్ షో చేయడం మీకు ఎలా అనిపించింది?" అని ప్రశ్నించగా, అనుపమ చాలా సరదాగా స్పందించారు. "నాకు కూడా ఇదొక పెద్ద షాకే. నేను అసలు ఊహించలేదు. సడన్‌గా అలాంటి ఒక అవకాశం వచ్చింది. కొత్త విషయాలను ప్రయోగాత్మకంగా చేయడం నాకు ఇష్టం కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇప్పటికే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు చేశాను" అంటూ తన ఆశ్చర్యంతో పాటు ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. 'ఢీ' షోలో జడ్జిగా ఎంట్రీ: తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'ఢీ' డ్యాన్స్ షోకు అనుపమ పరమేశ్వరన్, జానీ మాస్టర్ జడ్జిలుగా వ్యవహరిస్తున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్టింగ్‌తో అలరించే అనుపమ, తొలిసారి ఒక డ్యాన్స్ రియాలిటీ షోకి జడ్జిగా ఎంట్రీ ఇవ్వడం ఆమె కెరీర్‌లో మరో విశేషంగా నిలిచింది. పల్లెటూరి నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం': ఇదిలా ఉంటే, అక్టోబర్ 16న విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధువుల గొడవలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

# పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..

## అల్లు అరవింద్ స్పెషల్ నోట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
"ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.
పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.
పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.







# 'కాస్ట్' టీజర్ విడుదల

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేశారు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ ఈ సినిమాతో జంపన్నకు చాలా మంచి పేరు రావాలని, మరిన్ని సక్సెస్‌ఫుల్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 'మా హీరోలు వరుణ్ సందేశ్, గగన్, రవితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. త్వరలోనే పాటలు విడుదలవుతాయి. డైరెక్టర్ ఈ సినిమాను బ్రహ్మాండంగా తీశారు' అని అన్నారు. డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి, గగన్ అద్భుతంగా నటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు, నవీన్ ఎర్నేని, గగన్ బాబు, అనూప్ రూబెన్స్, రవి, సత్యం రాజేశ్, దివి వద్యా పాల్గొన్నారు.